నేడు బీపీ నిర్ధారణ పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బి.పి. నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి. వినోద్ శుక్రవారం తెలిపారు. బి.పి. ఉన్నవారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి సూచిస్తారు. మందులు సక్రమంగా వాడకపోతే వచ్చే దుష్పరిణామాలను వివరిస్తారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో సాయిబాబా ఆలయ 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



తాగునీటి వాల్వ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కాలనీలో పర్యటించారు. తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి తక్షణమే వాల్వ్ సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఇన్‌చార్జి మేనేజర్ ప్రియాంక, వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, బాలాజీనగర్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4 గంటలకు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి, పరివార దేవతా మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగించారు. 8, 9వ తేదీల్లో ఉదయం, సాయంత్రం హోమాలు, 10వ తేదీన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి, పరివార విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా చేయాలి



రాయదుర్గం: చదువుతోపాటు విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా చేయాలని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ ప్రొఫెసర్ సంజయ్ సుభోధ్ సూచించారు. శుక్రవారం హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో మినీ ట్రేడ్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఫెయిర్‌ను తిలకించిన ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన విద్య అందిస్తూనే వారు నైపుణ్యాలు కూడా నేర్చుకునేలా చేయాలన్నారు. విద్యార్థుల ఎగ్జిబిట్లు వారిలోని నైపుణ్యాలను ప్రస్ఫుటం చేస్తున్నాయని ప్రశంసించారు. అంతేకాకుండా ఫుడ్‌స్టాల్స్, పుస్తక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: రాయదుర్గం లక్ష్మణభాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి యేటా ఆరు రోజులపాటు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. శనివారం నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఈనెల 10వ తేదీ ,రథోత్సవాన్ని 12వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.

ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం ఇవ్వాలి

- హామీలను అమలు చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ/బాలానగర్: ఆడపడుచులకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం వెంటనే ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్‌లు, తహసీల్దార్‌లతో కలిసి 290 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేసి పేదింటి కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. ఎన్నికల్లో గెలవడం కోసం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశాడు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తారనే ఆశతో ఆడపడుచులు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే వారికి మొండిచేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తులం బంగారం ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్, మహేశ్వరి శ్రీహరి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మోతీనగర్: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించనున్నారని కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానందనగర్‌లో కమ్యూనిటీ హాలు వద్ద వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని, అనంతరం అవంతినగర్ తోటలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

నవగ్రహాల నూతన మండపానికి పూజా

కూకట్‌పల్లి: పాత శివాలయంలో నవగ్రహాల నూతన మండపానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ సత్యనారాయణతో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాఠశాల ప్రారంభం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండ రాజు కాలనీలో గ్లాండ్ ఫార్మా ఆధ్వర్యంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా ఫౌండేషన్ ట్రస్టీలు కె. రఘురామన్, పి. సంపత్‌కుమార్, ఎంఈఓ హరీశ్ చంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ్‌జ్యోతి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గ్లాండ్ ఫార్మా మేనేజ్‌మెంట్ ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని విజేత విద్యాలయంలో మైండ్ స్పార్క్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలు చాలా బాగున్నాయని మంత్రి కొనియాడారు. ఎగ్జిబిషన్‌లో రోవర్, రాడార్, చంద్రయాన్, ఆటోమేటిక్ కార్ పార్కింగ్ ఇండికేటర్, లేజర్ సెక్యూరిటీ అలారం, కార్బన్ ప్యూరిఫికేషన్, రివర్ క్లీనింగ్ బోట్ తదితర వాటిని విద్యార్థులు ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ పద్మజ, వడితల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రణవ్ పాల్గొన్నారు.



నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కులను అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 50 మంది లబ్ధిదారులకు శుక్రవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, బ్రిక్ శ్రీనివాస్, పోతుల రాజేందర్, మారెళ్ల శ్రీనివాసరావు, పురేందర్ రెడ్డి, కావూరి అనిల్, ఎల్లం నాయుడు, పోశెట్టి గౌడ్, శ్రావణిరెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని వాహనాల సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనుబాబు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం కైత్లాపూర్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు పన్ను చెల్లించకుండా తిరుగుతున్న మూడు వాహనాలను సీజ్ చేశారు. అందులో ఒక స్కూల్ మినీ బస్సు, ట్రాక్టర్, గూడ్స్ వాహనం ఉన్నాయి. నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని, అన్ని అనుమతి పత్రాలను వాహనదారులు వెంట ఉంచుకోవాలని ఎంవీఐ శ్రీనుబాబు సూచించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం దగ్గర కూకట్‌పల్లి బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో అపర కర్మల భవనం వద్ద శివాలయం (నీలకంఠేశ్వర ఆలయం) ఆలయ నిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నరేంద్ర చారి, సుబ్బారావు, పంచగంగేశ్వర్, ప్రతాప్ కుమార్, గోపాల రత్నం, కోదండ రామయ్య, దేవాలయ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో కార్పొరేటర్ శ్రీనివాసరావు

11 శాతం రిజర్వేషన్లు ఎందుకు అడగలేదు?

మంద కృష్ణ మాదిగను ప్రశ్నించిన పిడమర్తి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఆల్విన్‌కాలనీ: వర్గీకరణ చేయమని, మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మందకృష్ణ మాదిగ ఎందుకు అడగలేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలో వర్గీకరణ, కులగణనపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మాదిగ యూత్ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చిరుమర్తి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగ జేఏసీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగకు దామోదర రాజనర్సింహ రూ.30 లక్షలు ఇచ్చారని, రూ.20 లక్షలు ఇవ్వనందుకు దామోదర రాజనర్సింహను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నాక ఇప్పుడు బీజేపీ కోసం 11 శాతం అడుగుతున్నారని, 11 శాతం ఉద్యమం కేవలం పత్రిక ప్రకటనలకు మాత్రమే అంకితం అని ఎద్దేవా చేశారు. తరువాత బీజేపీ పార్టీ బలోపేతం కోసం, రాజ్యసభ సీటు కోసం మాత్రమే పనిచేస్తాడని, మాదిగల కోసం పనిచేయటం మందకృష్ణ మాదిగకు అలవాటు లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వస్తేనే విజయోత్సవ ర్యాలీ చేసిన మందకృష్ణ మాదిగ.. రాష్ట్రంలో వర్గీకరణ అమలు పరుస్తూ అసెంబ్లీలో ప్రకటన చేసినా ఎందుకు సంబరాలు చేసుకోవటం లేదో అర్థం కాని పరిస్థితి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై భారతదేశంలో మొట్టమొదటిసారి ఇంప్లిమెంట్ చేసిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఉందని, ఆ ఘనత సాధించిన మాదిగ పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, రింగు రాంబాబు, జోగు గణేష్, మీసాల మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టుల వారీగా ఓరియంటేషన్



కార్యక్రమంలో పాల్గొన్న హిందీ ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని పీఎస్ఎం హెచ్ఎస్ పాఠశాలలో హిందీ భాషపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఎంఈఓ కిషన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులకు భాషలో నైపుణ్యాలను, మెళకువలను వివరించారు. ఆర్పీలు వి. శర్మ రోహిత్‌కుమార్, శివకుమార్‌లు పరీక్ష ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని 109 పాఠశాలల హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శనివారం సోషల్, గణితం, సోమవారం ఇంగ్లిష్ సబ్జెక్టుపై ఓరియంటేషన్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

క్యూ ఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రం లొకేషన్‌ను పొందుపరచాలి

కేపీహెచ్‌బీకాలనీ: ప్రవేశ పరీక్షల ప్రాథమిక కీపై అభ్యంతరాలకు చెల్లించాల్సిన ఫీజును తగ్గించాలని, అదే విధంగా హాల్‌టికెట్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రం లొకేషన్‌ను పొందుపరచాలని శుక్రవారం స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు జేఎన్‌టీయూలో ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహానగరంలో ప్రముఖ ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఇంద్రాణి, హేమంత్ సిద్ధార్థ, దుర్గా ప్రసాద్, బూర్ల తనూజ్, జవ్వాజీ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

'మనూ' వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు, యువత శ్రీకారం చుట్టాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెండురోజుల జాతీయస్థాయి సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో అన్ని విభాగాల మధ్య సమన్వయం పెరగాలన్నారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా బోధనకు కృషి చేస్తున్నామన్నారు. సమయం, అవకాశం యొక్క విలువను గుర్తించాలన్నారు. హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.సి.శర్మ మాట్లాడుతూ తరువాతి తరాన్ని రూపొందించడంలో అధ్యాపకులు కీలకపాత్ర పోషించాలన్నారు. టీఐఎస్ఎస్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ రితేష్ మాట్లాడుతూ విద్య అనేది నిరంతర ఆవిష్కరణలను ప్రోత్సహించే చైతన్యవంతమైన రంగమన్నారు. సాంకేతిక పురోగతికి అనుగుణంగా ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు అవసరం అని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ప్రొఫెసర్ షగుప్తాషాహీన్, ప్రొ.వనజ, ప్రొఫెసర్ షాహీన్ షేక్, డాక్టర్ సబాఖాతూన్ ప్రసంగించారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

నిజాంపేట్ : సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సాబేర్ అలీ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ. 2024–25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్నందున ఆస్తి పన్నులు, దుకాణం లైసెన్స్ తదితర ఫీజులను వెంటనే చెల్లించాలన్నారు. చెల్లించకుంటే బకాయిదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సెలవు రోజుల్లో కూడా అన్ని పన్నులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నిలిచిన పనులు.. పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న వరద నీటి కాలువ నిర్మాణ ప్రాంతం

బాలానగర్: గత సంవత్సరం నవంబర్ నెలలో బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో చేపట్టిన వరద నీటి కాలువ నిర్మాణ పనులు రెండు నెలలుగా నిలిచాయి. రూ.60 లక్షల నిధులతో 120 మీటర్ల పొడవు నిర్మాణం చేయాల్సి వుంది. అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీటి జంక్షన్ కలిపే ప్రాంతంలో సుమారు 5 అడుగుల గొయ్యి ఉంది. ప్రమాదం జరగక ముందే వర్షపు నీటి కాలువ నిర్మాణం పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్



దుండిగల్: బీఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే వివేకానంద్ శుక్రవారం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సింగి జయభేరి టెంపుల్ ట్రీ కాలనీలో కలిశారు. కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో పార్టీపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెలే వెంట ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్: మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ఆల్ ఇండియా పాయమ్–ఈ–ఇన్సానియత్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గురుమూర్తినగర్‌లోని మజీద్–ఇ–నూర్ వద్ద ఉదయం 10 నుంచి శిబిరం కొనసాగుతుంది. డయాబెటీస్, బీపీ, డెంటల్, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలు నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాకేష్ గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కెవి గాయత్రి నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వివేకానందనగర్, పర్వత్‌నగర ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, 11కెవి అల్లాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాయత్రినగర్, జ్యోతి నగర్, చంద్ర గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు

మూసాపేట: కులగణన, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ సలీం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ కిట్టు, మేడ్చల్ జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ బాలరాజు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు డి. రంగస్వామి, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు చందు, కూకట్‌పల్లి నియోజకవర్గ జనరల్ సెక్రటరీ జే. రాజు, కూకట్‌పల్లి నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ సాయి ప్రణతి, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్ సేవలు మరువలేనివి

మూసాపేట: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రమాబాయి అంబేడ్కర్ జయంతిని మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా డిఫెన్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ కార్యదర్శి నరేందర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విదేశాల్లో చదువుతున్న సమయంలో రమాబాయి ఎన్నో కష్టాలతో కుటుంబ భారాన్ని మోసిందన్నారు. అదేవిధంగా మూసాపేట, అంబేడ్కర్‌నగర్‌లో పాతపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్క పెంటయ్య, కర్క డాకయ్య, కర్క శివశంకర్, భాస్కర్, నవీన్, అప్పలరాజు, కర్క నర్సయ్య, విష్ణు, పాతపల్లి కృష్ణ, నర్సింగ్‌రావు, నాగరాజు, గోపాల్ పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ తదితరులు